క్లుప్తంగా

అబ్బిరెడ్డిగూడెం వాసి నాగరాజుకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న నాగరాజు

గరిడేపల్లి : మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామంలో పేద కుటుంబానికి చెందిన రేవూరి నాగరాజుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ డాక్టర్ ముక్తావాణి పర్యవేక్షణలో సంస్కృతంపై చేసిన పరిశోధనకు గాను నాగరాజుకు డాక్టర్ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజుకు పలువురు అభినందనలు తెలిపారు.

ఇందిరానాయక్‌కు డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న ఇందిరా

మఠంపల్లి : మండలంలోని పాతదొనబండతండాకు చెందిన ధరావత్ ఇందిరానాయక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ శ్రీనివాస్‌నాయక్ పర్యవేక్షణలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 'వ్యర్థ వ్యవస్థ ఉపయోగించి కేవిటేషన్ సాంకేతికత 'అనే అంశంపై చేసిన పరిశోధన చేసి సమర్పించినందుకు తనకు డాక్టరేట్ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ఆర్డీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడిలో మహిళ, మాజీ ప్రజాప్రతినిధిని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అసభ్య పదజాలంతో దూషించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 225 సర్వే నంబర్‌లో గల 9 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వ భూమి అంటున్నారని వారం రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా శనివారం ఆ భూమిని పరిశీలించేందుకు వచ్చిన ఆర్డీఓ అక్కడ ఉన్న శెట్టి లక్ష్మి, మాజీ సర్పంచ్ శెట్టి సురేష్‌ను అసభ్య పదజాలంతో దూషించారని, అక్కడే ఉన్న మరి కొందరితో కూడా అదేవిధంగా మాట్లాడారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో శెట్టి సురేష్, శెట్టి రమేష్, మ్యుతం సతీష్, చంద్రయ్య, సత్యనారాయణ, గోపి తదితరులు ఉన్నారు.


నేడు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం శాస్త్రవేత్తలతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు ఆసక్తి గల రైతులు హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కాన్ఫరెన్స్‌లో పుట్టగొడుగుల పెంపకం అనే అంశంపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

నడిగూడెం : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాయపు దేవ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మండలానికి చెందిన రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు పాల్గొని అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దిర్శించర్ల మాజీ సర్పంచ్ మృతి



చిన అప్పయ్య (ఫైల్)

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వీరవల్లి చిన అప్పయ్య(88) సోమవారం మృతి చెందారు. వయోభారంతో గత కొంత కాలంగా నేరేడుచర్లలో నివాసం ఉంటున్న ఆయన అస్వస్థకు గురై మృతి చెందారు. 1970 నుంచి 1981 వరకు దిర్శించర్లకు సర్పంచ్‌గా పని చేశారు. ఆయన మృతి పట్ల నేరేడుచర్ల మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవీ, వనితా క్లబ్ సభ్యులు, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

రైతు కూలీలకు 'భరోసా' వట్టి మాటలే

నేరేడుచర్ల : రైతు కూలీలకు భరోసా కింద నగదు జమ చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ వట్టి మాటలేనని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ విమర్శించారు. సోమవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు కూలీలకు భరోసా కింద నగదు ఇస్తామని భట్టి ప్రకటించిన గడువు ముగిసినప్పటికీ ఉలుకు పలుకు లేరని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

ఆయకట్టులో కూలీల కొరత

- వరి నాట్లకు కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్న రైతాంగం
- పెరిగిన కూలి ఖర్చులు
- వెదజల్లే పద్ధతివైపు మొగ్గు చూపుతున్న రైతులు



మునగాలలో వరినాట్లు వేస్తున్న కూలీలు



విత్తనాలు వెదజల్లుతున్న రైతులు

మునగాల: ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఆయకట్టు ప్రాంతంలో కూలీల కొరత వేధిస్తోంది. సాగర్ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం రెండవ పంటకు సాగు నీరు విడుదల చేయడంతో రైతాంగం పక్షం రోజులుగా వరినాట్లను ముమ్మరం చేశారు. కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో నాట్లు ఆలస్యం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారు ముదిరిపోతోందని దిగుబడి తగ్గే అవకాశం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఆయకట్టు పరిధిలో ఒకేసారి వరినాట్లు వేసేందుకు రైతులు సమాయత్తం అవతుండడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో కూలీలు నాట్లు వేసేందుకు గుత్త విధానంలో కాకుండా దినసరి కూలి మీద నాట్లు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఒక్కో కూలీకి రోజుకు రూ.600 డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఎకరం పొలం ఆరుగురు వ్యవసాయ కూలీల సాయంతో నాట్లు వేసేవారు. ఎకరాకు మూడు వేల రూపాయలు ఉండేది. ప్రస్తుతం ఎకరాకు రూ.4,500లు ఇవ్వాల్సిందేనని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో సాగుఖర్చు మరింత పెరిగిపోతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయ కూలీల రవాణా ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వస్తోంది.

వెదజల్లే పద్ధతిపై మొగ్గు చూపుతున్న రైతులు

వరినాట్లు వేసేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతాంగం నాట్లు వేసే పద్ధతికి స్వస్తి చెప్పి విత్తనాలు వెదజల్లే పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు. విత్తనాలు వెదజల్లే పద్ధతిలో రైతులకు ఎకరాకు ఐదు నుంచి ఆరువేలు మిగిలే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయకట్టు పరిధిలో 50శాతం రైతులు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తున్నారు. భవిష్యత్‌లో నూరుశాతం రైతాంగం విత్తనాలు జల్లేపద్ధతిలో సాగుచేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

కూలీలు దొరకడం లేదు



ప్రస్తుతం వరిసాగులో కూలీల పాత్ర కీలకంగా మారింది. వరినాట్లు వేసేందుకు కూలీలు దొరకడం లేదు. నాటు కూళ్ల ఖర్చులు పెరిగాయి. కూలీలు సకాలంలో దొరకక నాట్లు ఆలస్యం అవుతున్నాయి. ఫలితంగా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. వచ్చే వానాకాలం సీజన్‌లో నాట్లువేసే పద్ధతికి స్వస్తి పలికి వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తాగ.

– తూముల వీరస్వామి, రైతు, మునగాల

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్ : కేసులు పెండింగ్ లేకుండా పనిచేయాలని, బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం అందరూ బాగా పని చేశారని, రాబోవు రోజుల్లో కూడా ఇలాగే ప్రజల మద్దతు పొందేలా పని చేయాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. నూతన సంవత్సర వేడుకలకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడ కూడా గొడవలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. బహిరంగంగా మద్యం తాగితే కేసులు నమోదు చేయాలని అన్నారు. బాణసంచా, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ఈ కార్యక్రమం అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస రావు, ఏఆర్డీ ఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల శ్రేయస్సే సంఘాల లక్ష్యం



పెన్షనర్లకు సన్మానిస్తున్న రావెళ్ల సీతారామయ్య, తదితరులు

హుజూర్‌నగర్ : నాయకులు చురుగ్గా ఉన్నప్పుడే సంఘం బలంగా ఉంటుందని, పెన్షనర్ల శ్రేయస్సే సంఘాల లక్ష్యమని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలు, జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు ఇంటికే పరిమితం కాకుండా ప్రతి రోజు సంఘ కార్యకలాపాల్లో పాలుపంచుకోవాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు హెల్త్ కార్డులు ఇప్పించేందుకు సంఘాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని, కొత్త సంవత్సరంలో హెల్త్ కార్డులు అందే అవకాశం ఉందని, పీఆర్‌సీ కూడా వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెన్న సోమయ్య అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, బి.రాంబాబు, కోదాడ, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల అధ్యక్షులు శ్రీనివాసరావు, పూర్ణచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ఎండీ మోహినోద్దీన్, దేవన్న, అంకతి అప్పయ్య, వీరారెడ్డి, కేవీఎన్ మూర్తి, ఎంఎస్ఎన్ రాజు, తాటి ప్రభాకర్‌రెడ్డి, వేముల వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

నేరేడుచర్ల : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో నేరేడుచర్ల పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మొదటి లెవల్‌లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డి. సత్యనారాయణ సోమవారం తెలిపారు. 3 నుంచి 9వ తరగతి విద్యార్థులు గణితంలో 42 మంది, సైన్స్‌లో 28 మంది, జనరల్ నాలెడ్జ్‌లో 13 మంది, ఆంగ్లంలో 12 మంది రీజనింగ్‌లో ఒక్కరు, మొత్తం 96 మంది విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తెలిపారు. వీరు 2025 ఫిబ్రవరి 2వ తేదీన జరగబోయే రెండో లెవల్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, డీజీఎం సుధాకర్, ఆర్ఐ సుజిత, కోఆర్డినేటర్లు నాగేశ్వర్‌రావు, నాగేందర్, డీన్ విజయకృష్ణ, ప్రైమరీ స్కూల్ ఇన్‌చార్జ్ శిరీష, పాఠశాల ఒలింపియాడ్ ఇన్‌చార్జ్ నరేష్‌చారి, నళిని, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

హుజూర్‌నగర్ : నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ చరమంద రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టామని, డీజేలకు ఎలాంటి పర్మిషన్ లేదని ఆయన తెలిపారు. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలపై పోలీసుల నిఘా ఉంటుందని ఎలాంటి సమస్యలు సృష్టించినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

మోతె : మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మోతె మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దని, తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని అన్నారు. డిసెంబర్ 31 రాత్రి పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి

మునగాల : మండల వ్యాప్తంగా మన ఊరు – మన బడి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పలువురు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు వారు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఊరు – మన బడి పథకం కింద పాఠశాల భవనాలు, డైనింగ్ హాల్ నిర్మాణాలు, వివిధ మరమ్మతులు చేయించామని, కానీ ఇప్పటివరకు కనీసం ఒక రూపాయి కూడా మంజూరు కాలేదని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.నాగరాజు, కొమ్ము ఈదారావు, వెంకటరాములు, సీతారాములు, వెంకన్న తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయొద్దు



కొండాపురంలో నర్సరీని పరిశీలిస్తున్న మండల పంచాయతీ అధికారి జగదీష్

చిలుకూరు : నర్సరీల్లో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయవద్దని మండల పంచాయతీ అధికారి జగదీష్ అన్నారు. సోమవారం చిలుకూరు మండలంలోని కొండాపురం గ్రామంలో గల నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కార్తీక్, గ్రామ పంచాయతీ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నదానం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

అనంతగిరి : అమావాస్య సందర్భంగా అనంతగిరి మండల కేంద్రంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జాతీయ కమిటీ, వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ రాజ్ దేశ్ గురుస్వామి ఆదేశాల మేరకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి సత్యనారాయణ, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ కొండపల్లి వాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు పందిరి వీరయ్య, జగిని ప్రసాద్, గరినే శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు యరసాని మన్మథకుమార్, కత్రం బాపూజీరెడ్డి, ఓరుగంటి రమేష్, కక్కిరేణి ప్రభాకర్, గవిని రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి



పాడి రైతులకు రుణాల చెక్కులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

కోదాడరూరల్ : పాడి రైతుల సంక్షేమానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం కోదాడలోని పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 8 మంది పాడి రైతులకు రూ.25 లక్షల 25 వేల రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ చేపడితే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని సూచించారు. అతి తక్కువ వడ్డీకే పాడి రైతులకు రుణాలు అందజేస్తున్నామని, రెండెకరాల భూమి ఉన్న రైతులకు నాటు కోళ్లు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకానికి 50 శాతం సబ్సిడీపై రుణాలు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్లు ప్రభాకర్ రావు, శెట్టి శ్రీనివాసరావు, సీతారామయ్య, గోబ్రా, సీఈఓ మంద వెంకటేశ్వర్లు సిబ్బంది ఉన్నారు.

కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



మునగాలలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మునగాల : బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం మునగాల మండల కేంద్రంలోని గణపవరం క్రాస్ రోడ్డులో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. కేంద్రమంత్రి ఒంటినిండా మనువాదం భావాలను నింపుకొని మహనీయుడు అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడడం ఈ దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనన్నారు. అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ సైదా, జూలకంటి విజయలక్ష్మి, మండల కమిటీ సభ్యులు దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, వెంకటాద్రి, మల్లారెడ్డి, సైదులు, కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నడిగూడెం : రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమిత్ వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమిత్‌షా తక్షణమే రాజీనామా చేసి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాయకులు కొరట్ల శ్రీనివాస్, కాసాని కిషోర్, మల్లెల వెంకన్న, ముస్కు వీరస్వామి, సిక్కుల ఉపేందర్, నాగభూషణం, నర్సయ్య, గోవర్ధన్, అప్పయ్య, పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, కార్మికులు

హుజూర్‌నగర్ : కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని పాతచింతల మిల్లు ప్రాంగణంలో నియోజకవర్గంలోని ఇటుక బట్టీల యజమానులు, కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికుల వేతన ఒప్పందంపై చర్చించాలన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. చర్చలపై ఇటుక బట్టీల యజమానులు సానుకూలంగా స్పందించడంతో పూర్తిస్థాయి ఒప్పందానికి సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, జిల్లా కార్యదర్శి చింతకాయల రాము, నాయకులు సలిగంటి జానయ్య, కందుల వెంకన్న, పాలకూరి లాలు, తాతారావు, మంగా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్రంపై విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్రంపై విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి పి.సత్యనారాయణరెడ్డి.. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడుతో బట్టు మధుతో కలిసి బహుమతులు అందజేశారు. జనవరి 4వ తేదీన జరిగే జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు యడవల్లి కృష్ణయ్య, యడవల్లి జానయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, యాదయ్య తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ శిరీష



ప్రజా వేదికలో పాల్గొన్న ఏపీడీ శిరీష, తదితరులు

నడిగూడెం : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ డి.శిరీష హెచ్చరించారు. నడిగూడెం మండలంలో మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2023– 24 ఏడాదిలో రూ.3.38 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 15 గ్రామ పంచాయతీలలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చేసిన ఉపాధి పనులపై నివేదికలను సంబంధిత సీఆర్‌పీలు చదివి వినిపించారు. రూ.1.53 లక్షలు రికవరీ చేయాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు. పలువురు సిబ్బందికి రూ.51 వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, ఏపీఎం ఆషారాణి, అంబుడ్స్‌మెన్‌లు ఎర్ర లింగారెడ్డి, లక్ష్మీ రామ్‌నాయక్, ఎస్ఆర్‌పీలు సాంబశివచారి, సురేష్, ఎంపీఓ విజయకుమారి, ఏపీఓలు శ్రీనివాసరావు, నగేష్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని సోమవారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపురంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు 30 గుంటల ప్రభుత్వ భూమి కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఆర్ఐ మంత్రిప్రగడ సీతయ్య, మాజీ ప్రజాప్రతినిధులు పల్లా రంగయ్య, బుడిగెం లింగయ్య, వేనేపల్లి ఉపేందర్, మేరిగె ఉపేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



అభయాంజనేయ స్వామి ఆలయంలో తిరుప్పావై పఠిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పలు దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవరులకు పంచామృతాలు, పంచసూక్తాలతో పూజలు చేశారు. శ్రీసూక్తం పారాయణం, లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. వేదపఠనం, అష్టోత్తరాలు, పాశుర పఠనం గావించారకార్యక్రమంలో వేదపండితులు చరణ్ శర్మ, విశ్వనాథశర్మ, దామోదరాచార్యులు, అర్చకులు పురుషోత్తమ శర్మ, చైర్మన్ సోమలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నడిగూడెం : కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను ఎంపిక చేయడం పట్ల నడిగూడెం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వేపూరి తిరుపతమ్మ, పార్టీ నాయకుడు వేపూరి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి తిరుపతమ్మ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని తహసీల్దార్‌కు వినతి

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని మాజీ సర్పంచ్ తమ్మబోయిన శంకర్ కోరారు. ఈమేరకు సోమవారం చిలుకూరు మండల కేంద్రంలో తహసీల్దార్ ధృవకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణపురం గ్రామ పంచాయతీ ఏర్పాటై 50 ఏళ్లు అయినా నేటి వరకు సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించలేదని తెలిపారు.

మాలధారులకు అన్నదానం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదానం కొనసాగుతోంది. సోమవారం కోదాడ పట్టణానికి చెందిన వంగవీటి నాగరాజు– పద్మ దంపతులు అన్నదానం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు తదితరులు ఉన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారిని, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షా బంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతు పూర్తి గావించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. శివాలయంలోని శ్రీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నాయకుల పరామర్శ

మోతె : మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన దోసపాటి లచ్చమ్మ, దోసపాటి లింగయ్య కుటుంబాలను సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం, బియ్యం అందజేశారు. బీఆర్‌ఎస్ మాజీ ఎంపీటీసీ పడగాల విద్యావతి వెంకటరెడ్డి, జిల్లపల్లి ముత్తయ్య, ఇండ్ల వెంకటేశం, పెరుమళ్ల వెంకన్న, అండెం నారాయణ, నకిరకంటి మల్లయ్య, ఐదబోయిన జగ్గయ్య, దోసపాటి రంగయ్య, ఏసు, శ్రీనురెడ్డి, రాము, రాంమల్లు, సుందర్ పాల్గొన్నారు.